

# దైవలీల.

వెల్చేటి సుబ్రహ్మణ్యం

**అరవై నాలుగు కళలలో ఉందో, లేదో తెలియదు కాని, పూలు మాల కట్టడం ఒక కళ అని మీ రొప్పుకోవాలి.**

అంతే కాదు, మా మల్లి అదే మల్లీశ్వరి ఆ విషయంలో కళా ప్రపూర్ణ అని ఒప్పుకు తీరాలి.

మల్లి లింగధారుల ఇంట లేకలేక కలిగిన ఏకైక సంతానం. తమ కడుపున ఓ కాయ కాయా లని వాళ్ళమ్మా, నాన్నా మునగని తీర్థం, చేయని పూజా లేదు. శ్రీశైలం మల్లన్న దర్శనం చేసుకున్నాక మల్లి కడుపున పడింది. ఆడ పిల్ల పుడుతుం దని సోది చెప్పింది ఎరుకలది. అందుకని పుట్టక ముందే మల్లీశ్వరి అని పేరు అనుకున్నారు.

మల్లిని పేరులోనూ, పిలుపులోనే కాదు - పెంపకంలో కూడా పువ్వుల్లో పెట్టి పెంచారు. ఎప్పుడూ పెదవుల చిరు నగవు పారాడే తన రూపు, మనసు మల్లెపువ్వు లాగే స్వచ్ఛమైనవి. అ దేమిటో, దానికి చిన్నప్పటి నుంచి పువ్వు లంటే ప్రాణం. చంటప్పుడు దేనికైనా ఏడిస్తే, ఏవైనా నాలుగు పువ్వులు



ముందు పడేస్తే టక్కున ఏడుపు ఆపి వాటితో ఆడుకునేది. ఇంతగా పువ్వులు ఇష్టపడే మల్లి తాను పువ్వులు పెట్టుకునేది కాదు. "మేం లింగధారులం. మా శివుడికి విభూతే ఇష్టం; పూలు కాదు" అనేది.

కదంబానికి రకరకాల పూలు కలుపులో గ్గానీ, వాటి పరిమళ వేళపై గాని మల్లి కున్న అవగాహనికి అత్తరు చేసే వాళ్లు కూడా ఆశ్చర్య పడాల్సిందే.

"మల్లిది రెండున్నర ఘడియలు, జాజిది ఘడియంపావు, సంపెంగది ఝామున్న రయితే మొగలిది రెండుంబావు ఝాములు. పారిజాతం అర ఝాము, పొగడ, పొన్నాగ ఘడియన్నర, కనకాంబరం పావు ఘడియ, కొమ్మ నుంచి కోశాక వీటి వాసన ఇంతకంటే ఎక్కువ సేపే అనిపించినా, పరిమళ గాఢత తగ్గిపోతుంది" అంటూ ఇలా ఏ పువ్వు ఎంత సేపు పరిమళిస్తుందో, ఏ పూల మాల ఎలా కట్టాలో మల్లి చెబుతుంటే ఎవరైనా నోరెళ్లబెట్టి వినాల్సిందే.

మా ఊరికి కూతవేటు దూరంలో ఉన్న బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరునికి, రాజరాజేశ్వరీ దేవికి ఎన్ని రకాల పూల మాలలు కట్టే దనుకున్నారు. సాయంత్రం క్షీరాభిషేకం చేశాక విభూతి పిండికట్ల నడుమ నిటాలాక్షిలా రుద్రాక్ష పూసంత కుంకుమ బొట్టు, నూట ఎనిమిది ఏకముఖి రుద్రాక్షల బంగారు మాలతో జీవకళ ఉట్టిపడేలా ఆ స్ఫటిక లింగానికి మల్లి అల్లిన మాల ఎంత శోభస్కరంగా ఉండే దనుకున్నారూ! పసిడి హారంలా మెరిసే తంగేడు పూల మాల కట్టినా, గన్నేరు, నూరు వరహాల పూలు కదంబం కట్టి వేసినా, దాని ముందు వెండి నాగాభరణం వెలవెలపోయే దంటే నమ్మండి.

అమ్మవారి సిగని చుట్టడానికి ఎంత నాజూకైన దండలు కట్టేదంటే - "మల్లీ! ఆ పరమేశ్వరుని అపార కరుణా కటాక్షాభిషిక్త జీవం కాకపోతే ఇంతటి కళా కౌశలంతో మాల కట్టడం మానవ మాత్రులకు సాధ్యం కాదు, తల్లీ!" అనేవారు పూజారి బ్రహ్మయ్య శాస్త్రి గారు. నిరంతరం శివ సేవలో కాలం గడిపే ఆమె యోగిని అనేవారు కొందరు.

దసరా నవరాత్రులలో ప్రభాత వేళ పొగడ, పొన్న, నూరు వరహాల మాలల అలంకరణలో అమ్మవారి విగ్రహం పచ్చి పాల మీద నురగతో చేసిందా అన్నట్లు భాసించేది. మధ్యాహ్నం తంగేడు, పచ్చ గన్నేరు మాలలతో పసిడి విగ్రహంలా, సాయం సంధ్య వేళ రక్తవర్ణ మాలలతో రౌద్రంగా రాజిల్లేది. అసలు మా ఊరి నవరాత్రి ఉత్సవాలకు మల్లి చేసే పూల అలంకరణ చూడటానికే పొరుగూళ్ల వాళ్లు వచ్చేవారండీ!

ఓ సాయం వేళ అనుకోకుండా స్వామి దర్శనానికి వచ్చిన విజయనగరం ప్రభువులు శ్రీశ్రీ విజయరామ గజపతిరాజులుం గారు ఈశ్వరాలంకృతమైన తంగేడు మాల కళా కౌశలానికి ముగ్ధులై, మాల అల్లిన మల్లిని మెచ్చుకుని ముత్యాల హారం బహూకరించారు. 'పరమేశ్వరుని దయ' అంటూ మల్లి సవినయంగా హారాన్ని స్వీకరించి, ఆత్మ ప్రదక్షిణ మాచరించి, "శివార్పణం" అంటూ హుండీలో వేసింది.

మల్లికీ, మాకూ ఎంత అనుబంధ మంటే - మల్లి దండ గుచ్చనిదే మా ఊళ్లో ఏ పండగా, ఏ ఇంటా ఏ వేడుకా జరిగేది కాదు. పండగలప్పుడు, పుట్టినరోజు లప్పుడు చిన్న పిల్లల దగ్గర నుంచి, ప్రౌఢల వరకు పోటీలు పడి మల్లితో జడలు కుట్టించుకునేవారు. పెళ్లి కూతురుకైతే మాత్రం రాజేశ్వరీ దేవి పాదాల చెంత పువ్వు ముందుగా పెట్టుకోమని, ఆ తర్వాత 'పెళ్లి కూతురు బాగుందా, జడ బాగుందా?' అన్నంతగా పూల జడ కుట్టేది. శోభనానికైతే మరి చెప్పక్కర్లేదు. "నీ మొగుడికి జడ అందం చూడటంతోనే ఝాము రాతిరి గడిచిపోతుందే, పిల్లా! జాగ్రత్త" అంటూ పెళ్లి కూతురిని అయిన వాళ్లు ఆటపట్టించేవారు.

సాన మీద గంధం చెక్కలా మా మధ్య తిరిగే మల్లి నిన్న మహా శివరాత్రినాడు అమ్మవారి మాలకై ఆలయంలోని పూల తోట కెళ్లి పూలు కోస్తూ పాము కాటుకు అక్కడి కక్కడే శివైక్యం పొందింది. మూడు పదులైనా దాటని తన జీవితంలో సువాసనల పూలతో ఇంతగా ముడిపడిన మల్లి తన అయిదవ ఏటనే 'పూర్వ సువాసిని' అన్నది హాలాహలం లాంటి చేదు నిజం!! ★

ఏడువారాల నగల్లో ఇది నాలుగవది